క్లుప్తంగా

నూరు శాతం ఫలితాలు సాధించడమే ధ్యేయం



మనుబోలు: పదో తరగతిలో జిల్లాలో నూరు శాతం ఫలితాలు సాధించడమే ధ్యేయమని విద్యాశాఖ ఆర్‌జేడీ సుబ్బారావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యాప్రమాణాలపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక సారిస్తారని తెలిపారు. విద్యార్థులు ఇళ్లకు వెళ్లాక చదువుపై శ్రద్ధ పెట్టేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. ఇందుకోసం స్టడీ మెటీరియల్ అందజేశామన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేసిందని, వీటిని రోజూ వినియోగించేలా సూచనలిచ్చామని తెలిపారు. విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం పాఠశాలల్లోనే తినేలా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ శేషాద్రివాసు, హెచ్‌ఎం డేవిడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యాబోధన

కోవూరు: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని విద్యాశాఖ ఆర్‌జేడీ బి.వి.సుబ్బారావు తెలిపారు. స్థానిక టీఎస్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థుల పట్ల చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్రంలో సొంత వెబ్‌సైట్ కలిగిన కళాశాల టీఎస్‌సీ అని తెలిపారు. ఇంటర్ తరువాత ఏం చేయాలి.. ఏఏ కోర్సుల్లో చేరాలన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట డీవీఈఓ మధుబాబు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్కే సికిందర్, అధ్యాపకులు ఉన్నారు.

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి అమెరికాలో ఉంటున్న నేరెళ్ల కిరణ్‌కుమార్, శ్రీదివ్య, అక్షయ్య, కృతిక ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆలయానికి టీవీ బహూకరణ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి దాతలు మంగళవారం టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన రామిశెట్టి పెంచలయ్య – పెంచలమ్మ దంపతులు, వారి కుమార్తె ప్రమీల ఆలయానికి రూ.27 వేల విలువ చేసే 4కే ఎల్‌ఈడీ టీవీని అందజేశారని తెలిపారు.

ప్రత్యర్థులు కూటమిగా వచ్చినా ఒరిగేదేమీలేదు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీలు కూటములుగా ఏర్పడి వచ్చినా ఒరిగేదేమీలేదని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని 46వ డివిజన్లో గల ములుమూడి బస్టాండ్ సెంటర్, మొఘల్ వీధి, చిన్నబజార్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆజాద్ సెంటర్‌లో రూ.40 లక్షలతో ఐల్యాండ్, కనెక్టింగ్ రోడ్లను అభివృద్ధి చేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని వెల్లడించారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను త్వరలో ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజల వద్దకు వెళ్తామని ఇప్పటికే చాలా మంది చెప్పారని, ప్రస్తుతం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డీ చెప్తున్నారన్నారు. ఎవరొచ్చినా తనకెంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఎవరెక్కడ తిరిగినా ఒరిగేదేమీ లేదని, సీఎం ఆశీర్వాదం.. ప్రజల ఆశీస్సులతో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ వేలూరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని నమ్మించి రూ.40 లక్షలను కాజేసిన ఘటనలో చిన్నబజార్ పోలీసులు చీటింగ్ కేసును నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఫతేఖాన్‌పేటలోని అరిగెలవారివీధికి చెందిన రామయ్య.. వైఎస్సార్ జిల్లాకు చెందిన సుబ్బరాయుడు, మహబూబ్ అలీ కన్సల్టేషన్ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. మినీబైపాస్‌లో శకుంతలమ్మకు సంబంధించిన స్థలాన్ని తాము అగ్రిమెంట్ చేసుకున్నామని, అందులో కొంత ఇస్తామంటూ రామయ్య వద్ద రూ.40 లక్షలను తీసుకున్నారు. అగ్రిమెంట్ పత్రాలను రామయ్యకు ఇచ్చారు. కొద్ది రోజుల అనంతరం అగ్రిమెంట్ పత్రాలను ఇస్తే బ్యాంక్ లోను తీసుకుంటామని రామయ్యను నమ్మించి తీసుకున్నారు. అప్పటి నుంచి నగదు ఇవ్వకుండా నిందితులు తప్పించుకొని తిరుగుతున్నారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్లాబ్ ధ్వంసం

నెల్లూరు(క్రైమ్): స్లాబ్, గోడను గుర్తుతెలియని దుండగుడు పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న విజయకు ఇద్దరు కుమార్తెలు. తన భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటున్నారు. చిన్నకుమార్తె నాగమణి సంక్రాంతి సమయంలో తల్లి వద్దకు వచ్చారు. ఈ క్రమంలో గత నెల 13వ తేదీ తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ఇంటి మిద్దెపైన గోడలు, స్లాబ్‌ను పాక్షికంగా ధ్వంసం చేశారు. శబ్దం విని విజయ బయటకొచ్చి చూసేసరికి దుండగుడు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బంగారు నెక్లెస్ చోరీ

నెల్లూరు(క్రైమ్): వివాహ వేడుకల్లో బంగారు నెక్లెస్‌ను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసి పరారైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లోని కృష్ణ మందిర సమీపంలో నివాసం ఉంటున్న వెంగయ్య స్థానికంగా సిమెంట్, స్టీల్ షాపును నిర్వహిస్తున్నారు. ఆయన పెద్ద కుమార్తె వివాహాన్ని పురస్కరించుకొని తన కుటుంబసభ్యులతో కలిసి పిచ్చిరెడ్డి కల్యాణ మండపానికి ఈ నెల రెండున వెళ్లారు. ఈ క్రమంలో వధువు రూమ్‌లోకి గుర్తుతెలియని దుండగుడు ప్రవేశించి డబ్బాలో ఉన్న 45 గ్రాముల బంగారు నెక్లెస్‌ను అపహరించారు. గమనించిన వెంగయ్య భార్య కేకలేశారు. అప్పటికే దుండగుడు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య తెలిపారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన అశ్విని వేదాయపాళెంలోని సుస్మిత నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ తొలి సంవత్సరం చదువుతూ అక్కడి హాస్టల్లో ఉంటున్నారు. ఈ నెల ఐదో తేదీన ఆమె తల్లి అరుణ హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేసి కుమార్తెను ఇంటికి పంపాలని కోరారు. ఈ క్రమంలో అశ్విని తన తల్లికి ఫోన్ చేసి ఎంజీబీ మాల్లో ఉన్నానని, తర్వాత వస్తానని చెప్పారు. రాత్రయినా కుమార్తె రాకపోవడం.. ఫోన్ చేయగా స్విచాఫ్ అని రావడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో దర్గామిట్ట పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారు ఢీకొనడంతో వాహనచోదకులు గాయపడ్డారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. కోవూరు మండలం వేగూరుకు చెందిన మామాఅల్లుడు శీనయ్య, ఏడుకొండలు పెయింట్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. నెల్లూరు నుంచి జాతీయ రహదారి మీదుగా ఇంటికి వీరు బయల్దేరారు. భగత్‌సింగ్‌కాలనీ వద్దకు వచ్చేసరికి గూడూరు వైపు నుంచి వస్తున్న కారు మితిమీరిన వేగంతో బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ఘటనలో శీనయ్య తలకు తీవ్రగాయాలు కాగా, ఏడుకొండలు స్వల్పంగా గాయపడ్డారు. శీనయ్యను 108 సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను పోలీసులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలపై ఈ – చలానాలను విధిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్న ముగ్గురిపై కావలి రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కావలి ఏజే ఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపర్చగా, నిందితులకు ఏడు రోజుల సాధారణ జైలుశిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానాను న్యాయమూర్తి విధించారు.

సుకన్య సమృద్ధి యోజనపై అవగాహన సదస్సు

నెల్లూరు(మినీబైపాస్): సుకన్య సమృద్ధి యోజనపై గురు, శుక్రవారాల్లో అవగాహన సదస్సును నిర్వహించనున్నామని తపాలా శాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆడపిల్లలకు ఆర్థిక భరోసా లభిస్తుందని చెప్పారు. పదేళ్లలోపు బాలికల తల్లిదండ్రులు సమీపంలోని పోస్టాఫీసుల్లో ఖాతాలను ప్రారంభించాలని కోరారు.

యువతకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

నెల్లూరు(మినీబైపాస్): యువతకు శిక్షణ తరగతులను నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ మాట్లాడారు. స్వయం ఉపాధి రంగంలో యువత ముందుకెళ్లాలని కోరారు. సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

21వ డివిజన్లో ఆత్మీయ సమావేశం

నెల్లూరు రూరల్: నగరంలోని 21వ డివిజన్లో గల రవీంద్రనగర్‌లో ఆత్మీయ సమావేశాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం నిర్వహించారు. మేయర్ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. బకాయిలున్న వాణిజ్య భవన యజమానులకు నోటీసులను జారీ చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులను జారీ చేసి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. మొండి బకాయిదారులను గుర్తించి వారికి సంబంధించిన ఆస్తులను జప్తు చేసి.. కుళాయి డ్రైన్ కనెక్షన్లను తొలగించాలని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ దుకాణాల అద్దె బకాయిలను పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ ఆఫీసర్లు రాజేశ్వరి, సమద్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంగీత, నృత్య మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ సమీపంలోని ఎస్వీబీ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన సంగీత, నృత్య మహోత్సవాలు అలరిస్తున్నాయి. ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ నెల్లూరు ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి హాజరయ్యారు. పాఠశాల అధ్యాపకురాలు శ్రీవత్సల, చందన హైందవి గాత్రకచేరి వీనులవిందుగా సాగింది. శివకుమార్, వనజ, మౌనిక, అచ్యుతభట్ వాద్య సహకారం అందించారు. పాఠశాల అధ్యాపకురాలు తిరుపతమ్మ శిష్య బృంద భరత నాట్య ప్రదర్శన అలరించింది. ప్రిన్సిపల్ సాయిబాబా, తదితరులు పర్యవేక్షించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంచలరావు, వెంకటస్వామి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పెంచలరావు మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాల్లో పాల్గొనాలని కోరారు. నేతలు వెంకటేశ్వర్లు, ఆంజనేయవర్మ, పెంచలయ్య, రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, చిన్నమ్మ, అరుణ, షంషుద్దీన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జీఓలను రద్దు చేయాలంటూ ధర్నా



నెల్లూరు (టౌన్): విద్యా ప్రమాణాలను దిగజార్చే 84, 85, 117 జీఓలను వెంటనే రద్దు చేయాలని ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చిబాబు కోరారు. గాంధీబొమ్మ వద్ద ధర్నాను ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ సంఘ నేత రమణయ్య, విద్యార్థి సంఘ నేతలు సునీల్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నేతలు రియాజ్, జుల్ఫికర్, కోటేశ్వరరావు, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రావు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి



నెల్లూరు సిటీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరంలోని 17, 18వ డివిజన్లలో గల సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలను మంగళవారం చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడారు. ఓటరు కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని ఆదేశించారు. వలంటీర్ల ద్వారా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేయించాలని పేర్కొన్నారు. సచివాలయ కార్యదర్శులు డ్రెస్‌కోడ్‌ను విధిగా పాటించాలని చెప్పారు.

ఘనంగా సింహపురి స్వర్ణ కార్మిక సంఘ వార్షికోత్సవం



నెల్లూరు(వేదాయపాళెం): సింహపురి స్వర్ణ కార్మిక పరస్పర సహాయ సహకార సంఘ వార్షికోత్సవాన్ని చిన్నబజార్‌లోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. తొలుత కేక్‌ను కట్ చేసి.. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడారు. స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ సహకారంతో స్వర్ణకారుల షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. సంఘ నేతలు రియాజ్, కుమార్, వెంకట్రావ్, సురేంద్ర, షానవాజ్, ఖలీల్, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' విజయకేతనం



నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ పర్సంటైల్‌ను సాధించిన విద్యార్థులను హరనాథపురంలోని కళాశాలలో మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. మేఘన 99.99, లోహిత్ ఆదిత్యసాయి 99.97, మృదుల్ కృష్ణారెడ్డి 99.94, సాయి శ్రీవత్సవ్‌రెడ్డి 99.9, ప్రణీత్‌సాయి 99.89, అర్జున్ 99.84, అభిషేక్ ప్రీతమ్ 99.78, సాయి హనుమవిఘ్నేష్ 99.75 పర్సంటైల్‌ను సాధించారని వివరించారు. 99 పర్సంటైల్‌కుపైగా 25 మంది, 98కు పైగా 45 మంది, 97కుపైగా 57 మంది, 95కుపైగా 92 మంది, 90కుపైగా 173 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు.

'విశ్వసాయి' ఉత్తమ ప్రతిభ

నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయకేతనాన్ని ఎగురవేశారని కళాశాలల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఉత్తమ పర్సంటైల్‌ను సాధించిన విద్యార్థులను మాగుంట లేఅవుట్లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. అఖిల్ 98.99 పర్సంటైల్‌ను సాధించారని చెప్పారు. 90కుపైగా పర్సంటైల్‌ను 11 మంది, 80కుపైగా 31 మంది సాధించారన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పర్సంటైల్‌ను 96 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు.



'ఎస్సార్' విద్యార్థులకు అభినందన



నెల్లూరు రూరల్: జేఈఈ మెయిన్స్‌లో చింతారెడ్డిపాళెం సమీపంలోని ఎస్సార్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. 120 మంది పరీక్షలకు హాజరుకాగా, 80 మంది అర్హత సాధించారు. వెంకటసుభాష్ 99.26, హిమ సమీరా 96.12, వివేక్ శ్రీనివాస్‌రెడ్డి 92 పర్సంటైల్‌ను సాధించారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని అభినందించారు. రాయలసీమ డీజీఎం సమ్మిరెడ్డి, నెల్లూరు జోనల్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, అకడమిక్ డీన్ కృష్ణారెడ్డి, ఏజీఎం రణధీర్, ప్రిన్సిపల్ సుధాకర్, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణచైతన్య' విజయదుందుభి

నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. అశోక్‌రెడ్డి 99.16, వెంకటసుశాంత్, సాయిశ్రీపాద 99.07, రితికా ప్రసన్న 98.36, వెంకటశ్రీకృష్ణ 98.02 పర్సంటైల్‌ను సాధించారని వివరించారు. 90కుపైగా పర్సంటైల్‌ను 16 మంది, 80కుపైగా 26 మంది సాధించారని చెప్పారు. డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' ప్రభంజనం

నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల డీన్ శ్రీరామ్ పేర్కొన్నారు. ఉత్తమ పర్సంటైల్‌ను సాధించిన విద్యార్థులను కళాశాలలో అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. వెంకటసాయిదీపక్ 98.97, భూపాల్‌రెడ్డి 97.76, వెంకటయామిని 96.33 పర్సంటైల్‌ను సాధించారన్నారు. 90కుపైగా పర్సంటైల్‌ను 18 మంది, 85కుపైగా 29 మంది, 80కుపైగా 37 మంది సాధించారని వివరించారు.

